సాక్షి
అనకాపల్లి
శనివారం । 7 । జనవరి । 2023



చోడవరం కళా నిలయం

మూడు రోజులుగా జరుగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. త్వరలో కళాభారతి ఆడిటోరియం నిర్మిస్తామని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చెప్పారు. 8లో



పీవీకి కేంద్ర మంత్రి నివాళి

విశాఖ: బీజేపీ సీనియర్ నాయకుడు పి.వి.చలపతిరావుకు కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి మురళీధరన్ నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాధవ్‌ను ఓదార్చారు.

ఉధృతంగా చలిగాలులు



సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. శుక్రవారం పాడేరు మండలం మినుములూరులో 12డిగ్రీలు, అరకులోయలో 15.2, చింతపల్లిలో 16డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలిగాలుల తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

న్యూస్‌రీల్

16న బొజ్జన్న కొండపై బౌద్ధ మేళా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్: ప్రశాంతమైన వాతావరణంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించుకోవాలని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి చెప్పారు. తన కార్యాలయంలో శుక్రవారం బొజ్జన్న కొండ వద్ద ఈనెల 16న జరిగే బౌద్ధ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండగల్లో కనుమ రోజు విశాఖ బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. విశాఖ బౌద్ధ సంఘాల అధ్యక్షుడు మాటూరి శ్రీనివాస్, సభ్యులు బల్లా నాగభూషణం, వినకోట నీలేశ్‌గుప్తా, అల్లాడ శ్రీనివాసరావు, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత చార్జీలతోనే సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్/నర్సీపట్నం: సంక్రాంతి పండగను పురస్కరించుకొని అనకాపల్లి డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి, నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయబోమని చెప్పారు. అనకాపల్లి డిపో నుంచి రాజమండ్రి, విజయవాడ, నర్సీపట్నం డిపో నుంచి రాజమండ్రి, హైదరాబాద్, విజయవాడలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. పైబస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు. రాకపోకలకు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణం టికెట్లో 10 శాతం, వృద్ధుల కు 25 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

గవర్నర్ పర్యటన వాయిదా

పద్మనాభం(భీమిలి): పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో శనివారం రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పర్యటన వాయిదా పడినట్టు రాజీవ్ గాంధీ మానవ సేవ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్ తెలిపారు. బర్లపేటలో దివ్యాంగ బాల బాలికల ఉచిత విద్య శిక్షణ, వృద్ధాశ్రమం, యోగా కేంద్రం నూతన భవన నిర్మాణానికి గవర్నర్ శంకుస్థాపన చేయాల్సి ఉందన్నారు.అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమం వాయిదా పడిందన్నారు.

నేడు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి రాక

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి శనివారం విశాఖ రానున్నారు. విశాఖలో మార్చి నెలలో జీ20 సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆమె పలు ప్రాంతాలు పరిశీలించనున్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖకు సంబంధించి ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు.

నామినేషన్ల వరకు ఓటర్ల నమోదు

- రాజకీయ పార్టీలతో సమావేశంలో జేసీ కల్పనాకుమారి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన జేసి కల్పనాకుమారి

తుమ్మపాల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల జాబితా తయారీలో పూర్తి సహాయ సహకారాలందించాల్సిందిగా రాజకీయ పార్టీలను జేసీ కల్పనాకుమారి కోరారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌పీ చట్టం-1950లోని సెక్షన్ 22, 23 నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల నామినేషన్ల వరకు ఓటర్ల జాబితాను అప్‌డేట్ చేయాల్సిందేనన్నారు. అర్హులైనప్పటికీ ఓటరుగా నమోదుకాని వారు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫారం-7, సవరణల కోసం ఫారం -8 ద్వారా నివేదించుకోవచ్చని తెలిపారు. నామినేషన్ల చివరి తేదీకి 10 రోజుల ముందు వరకు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. సీఈవో కార్యాలయ వెబ్‌సైట్ www.ceoandhra.nic.in లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బొడ్డేడ సూర్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, సూరిశెట్టి భాస్కరరావు, ఆర్ శంకరరావు, వైఎస్ భద్రం పాల్గొన్నారు.

లాభాల జోష్

- అంతర్జాతీయ మార్కెట్లో మన్యం క్లీన్ కాఫీకి భలే డిమాండ్
- గత సీజన్‌లో ఏపీఎఫ్‌డీసీకి రూ.6 కోట్ల మేర ఆదాయం
- ఈఏడాది అదే పరిస్థితి ఉండొచ్చని ఆశ
- నర్సీపట్నం క్యూరింగ్ సెంటర్‌లో ఊపందుకున్న పనులు

అంతర్జాతీయ మార్కెట్లో క్లీన్ కాఫీకి గతేడాది మంచి ధర లభించడంతో రూ.6 కోట్ల మేర ఆదాయం పొందిన ఏపీఎఫ్‌డీసీ ఈ ఏడాది అదే జోష్‌తో క్యూరింగ్ పనులు మొదలు పెట్టింది. ఆ సంస్థకు చెందిన క్యూరింగ్ సెంటర్ తెలుగు రాష్ట్రాల్లోని నర్సీపట్నంలో మాత్రమే ఉంది. ఇక్కడ తయారయ్యే క్లీన్ కాఫీని అంతర్జాతీయ మార్కెట్‌కు తరలిస్తుంటారు.



మాన్యువల్ పద్ధతిలో కాఫీ గింజలను వేరు చేస్తున్న మహిళా కార్మికులు

నర్సీపట్నం: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నిర్వహిస్తున్న కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో పనులు ఊపందుకున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇది ఒక్కటే కావడంతో నర్సీపట్నం క్యూరింగ్ సెంటర్‌కు ప్రత్యేకత ఉంది. వందలాది మంది కార్మికులకు ఆరు నెలల పాటు ఈ సెంటర్ ద్వారా ఉపాధి లభిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితి బాగుండడంతో రెండేళ్లుగా అల్లూరి ఏజెన్సీ కాఫీ గింజలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

మన్యంలో కాఫీని సేకరిస్తూ..

మన్యంలో ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో సుమారు 10 వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. అరాబికా, కావేరి, రొబస్టా రకాలను సాగు చేస్తున్నారు. అల్లూరి జిల్లాలోని పాడేరు, ఆర్వీనగర్, చింతపల్లి డివిజన్‌ల్లో సేకరించిన కాఫీ గింజలను ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్పింగ్ సెంటర్లలో పైపార, తేమ శాతం తగ్గిస్తారు. తేమ 10 శాతానికి తగ్గే వరకు ఆర బెడతారు. అక్కడ నుంచి కాఫీ గింజలను నర్సీపట్నంలోని క్యూరింగ్ సెంటర్‌కు తరలిస్తారు.



కాఫీ గింజలు

క్యూరింగ్ సెంటర్‌లో..

పల్పింగ్ సెంటర్ల నుంచి వచ్చిన కాఫీ గింజలను నాణ్యత ఆధారంగా గ్రేడింగ్ చేస్తారు. ఇక్కడ రెండు విధానాల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది. ముందు యంత్రాల సాయంతో, తరువాత మాన్యువల్ విధానంలో గ్రేడింగ్ చేస్తారు. పల్పింగ్ యూనిట్ల నుంచి వచ్చిన కాఫీ గింజలను తేమ లేకుండా క్యూరింగ్ సెంటర్ యార్డులో కొద్దిరోజులు ఎండబెడతారు. తేమశాతం తగ్గిన తరువాత యంత్ర సాయంతో వేరు చేస్తారు. ఇక్కడ ఎనిమిది గ్రేడ్‌ల్లో విభజిస్తారు. మొదటి నాలుగు గ్రేడ్‌లకు మాత్రమే ధర బాగుంటుందని క్యూరింగ్ సెంటర్ అధికారులు చెబుతున్నారు. ఈ గింజలను క్లీన్ కాఫీ అంటారు.

అంతర్జాతీయ మార్కెట్ ధర ఆధారంగా లావాదేవీలు

అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ఆధారంగా వేలం విధానంలో లావాదేవీలు నిర్వహిస్తారు. పత్రిక ప్రకటన ద్వారా టెండర్లు ఆహ్వానించి వేలం నిర్వహిస్తారు. మార్కెట్ అవసరాల కన్నా బ్రెజిల్ దేశం నుంచి కాఫీ రావడంతో మన కాఫీకి గిరాకీ తగ్గింది. మూడేళ్లగా బ్రెజిల్ కాఫీ ఉత్పత్తి తగ్గడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో అల్లూరి ఏజెన్సీ క్లీన్ కాఫీకి ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది కూడా గత ఏడాది కంటే ధర పెరగవచ్చని క్యూరింగ్ అధికారులు చెబుతున్నారు. కిలో కాఫీ పిక్కల ధరలు 2019-20 లో రూ.200లు 2020-21లో రూ.184, 2021-22లో రూ.331 పలికాయి. గతేడాది కంటే ఈ ఏడాది ధర పెరగవచ్చని ఏపీఎఫ్‌డీసీ అధికార వర్గాలు భావిస్తున్నాయి.

ధర బాగుంది

అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెజిల్ కాఫీ దిగుబడి తగ్గడంతో అల్లూరి ఏజెన్సీ కాఫీకి మూడేళ్లగా మంచి ధర వస్తోంది. క్యూరింగ్ పనులు డిసెంబరు 28 నుంచి ప్రారంభమయ్యాయి. గత ఏడాది మార్కెట్‌లో కిలో రూ.331 రేటు పలకడంతో 185 మెట్రిక్ టన్నులు విక్రయించగా ప్రభుత్వానికి రూ.6 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 230 మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీని విక్రయించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.ప్రస్తుతం క్యూరింగ్ పనులు ఊపందుకున్నాయి. క్యూరింగ్ పనులు ఆరు నెలల పాటు కొనసాగుతాయి.

– స్వర్ణలత, డివిజనల్ మేనేజర్, కాఫీ క్యూరింగ్ సెంటర్, నర్సీపట్నం

స్థాయీ సంఘంలో 13 అంశాలకు ఆమోదం



స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 13 అంశాలతో పాటు ఒక టేబుల్ అజెండా పొందుపరచగా, అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. బుచ్చిరాజుపాలెంలో రాత్రి నిరాశ్రయుల కేర్ టేకర్, మేనేజర్ పారితోషికంతో పాటు నిర్వహణ ఖర్చులు ఏడాదికి రూ.6.24 లక్షలు, రెవెన్యూ విభాగంలో దుకాణాలు, వాణిజ్య సముదాయాల అద్దెలు, అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు వేయడం వంటి అంశాలను ఆమోదించారు. అలాగే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్లు కొండ్ర హరి గోపాలకృష్ణ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-19 నుంచి 26 వార్డులకు), బోడసింగి సుధాకర్ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-66, 67, 68 వార్డులు), భీమిలి జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రట్టపు రవికుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.314.47 లక్షలకు ఆమోదం తెలిపారు. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ఆరిలోవలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ లీజుకు ఆమోదం తెలిపారు.

ఉత్తరాంధ్రకు తీరని లోటు



తులసీరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

- విశాఖ డెయిరీని అగ్రగామిగా నిలిపిన మహానుభావుడు
- తులసీరావుకు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి నివాళి

యలమంచిలి: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు మృతి పాడి రైతులకు, ఉత్తరాంధ్ర ప్రజలకు తీరని లోటని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి యలమంచిలి పట్టణంలో తులసీరావు నివాసానికి వచ్చి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతుల సంక్షేమం కోసం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి దేశంలోనే విశాఖ డెయిరీని అగ్రగామిగా నిలిపి, తులసీరావు ఆంధ్ర కురియన్‌గా పేరుపొందారన్నారు. అటువంటి మహనీయుడు లేని లోటు రైతులకు తీర్చలేనిదన్నారు. ఆయన ఆశయాల మేరకు అందరూ నడుచుకోవాలని, అందుకు తమ పార్టీ మద్దతు ఎల్లవేళలా వుంటుందని తులసీరావు సతీమణి జయమ్మ, కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె పిళ్లా రమాకుమారిలకు చెప్పారు. విజయసాయిరెడ్డి వెంట రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు తదితరులు ఉన్నారు.



తులసీరావు చిత్రపటానికి నివాళి

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

- పాయకరావుపేటలో భారీ ఏర్పాట్లు
- పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి రాక



సమావేశం ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని పాయకరావుపేటలో ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. టీటీడీ చైర్మన్, పార్టీ అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని చెప్పారు. శుక్రవారం ఆయన కొరుప్రోలులో నియోజకవర్గ నేతలతో సమావేశ ఏర్పాట్లపై చర్చించారు. నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, సచివాలయ సమన్వయకర్తలు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఈ సభను విజయవంతం చేయాలన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలిరావాలన్నారు. పాయకరావుపేట పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రఘుపతి కల్యాణమండపంలో సమావేశం జరుగుతుందన్నారు. కల్యాణ మండపాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు జెడ్పీటీసీ ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, గూటూరు శ్రీను, ఐసరపు పార్వతి తాతారావు, శీరం నర్సింహమూర్తి, పోలిశెట్టి ఈశ్వరరావు, శేషారత్నం, బి.బాబ్జి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా.. కుటుంబానికి దగ్గరగా..

- విముక్తి పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం
- మద్యం మానేసిన 17మందికి జేసీ సత్కారం



మద్యానికి దూరంగా ఉన్న వారిని సత్కరిస్తున్న జేసీ కల్పనాకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

మునగపాక: చెడు వ్యసనాలకు దూరమైతే కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి అన్నారు. అందుకు మునగపాక మండలంలో అమలు చేసిన 'విముక్తి' పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడమే చక్కని ఉదాహరణ అని ఆమె చెప్పారు. మండల పరిషత్ హాలులో మద్యం మానివేసి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉన్న 17మందిని జేసీ కల్పనాకుమారి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్యానికి బానిసలై పలువురు తమ కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకోవడం బాధాకరమన్నారు. ఇందుకోసం ప్రవేశపెట్టిన విముక్తి పైలట్ ప్రాజెక్ట్ మంచి ఫలితాలు ఇవ్వడం ఆనందదాయకమన్నారు. మద్యానికి దూరంగా ఉండడం ద్వారా కుటుంబాలకు దగ్గరగా ఉండవచ్చన్నారు. చెడు వ్యసనాల బారినపడ్డ వారిలో మార్పు తీసుకువచ్చేందుకు విముక్తి ప్రాజెక్ట్ దోహదపడుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు ముందుకొచ్చి కార్యక్రమం విజయవంతంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. మునగపాక మండలంలో తొలిసారిగా 11 పంచాయతీల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి, ఈవోఆర్డీ ఈశ్వరరావు, అనకాపల్లి వంద పడకల ఆస్పత్రి వైద్యాధికారి కృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, తహసీల్దార్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


8 వరకు డ్వాక్రాబజార్ కొనసాగింపు

- రూ.3 కోట్లు దాటిన విక్రయాలు

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): అఖిల భారత డ్వాక్రా బజార్ సరస్-2022 విజయవంతంగా సాగుతోంది. గురువారం నాటికి రూ. 3,25,81,401 విక్రయాలు జరిగినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు. గురువారం రికార్డు స్థాయిలో రూ 50,83,130 విలువైన వస్త్రా లు, వస్తువుల విక్రయాలు జరిగాయన్నారు. అనూహ్య స్పందన వస్తున్న నేపథ్యంలో డ్వాక్రాబజార్‌ను ఆదివారం వరకు పొడిగిస్తున్నట్లు ఆమె తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు దేశవ్యాప్తంగాతమ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్న సంగతి తెలిసిందే.

మహిళా సర్పంచ్‌పై జనసేన నాయకుల దాడి

- గ్రామసభలో గలాటా
- కార్యదర్శిపై కూడా దౌర్జన్యం
- రాళ్లు రువ్వడంతో భయంతో పరుగులు
- హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఫిర్యాదు



తమపై దాడులకు పాల్పడిన జనసేన నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అప్పలనర్స



గ్రామసభలో సర్పంచ్, అధికారులతో వాగ్వాదానికి దిగిన జనసేన నాయకులు

నక్కపల్లి: మహిళా సర్పంచ్‌పై జనసేన నాయకులు దాడికి పాల్పడ్డారు. గ్రామసభ జరుగుతుండగా అడ్డుకుని ఘర్షణకు దిగి రాళ్లు రువ్వడంతో సర్పంచ్‌తోపాటు, కార్యదర్శి, వార్డు సభ్యులు ప్రాణభయంతో పరుగులు తీశారు. తమకు జనసేన నాయకుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధిత సర్పంచ్, ఆమె కుటుంబ సభ్యులు, కార్యదర్శి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం సర్పంచ్ పిక్కి అప్పలనర్స అధ్యక్షతన రాజయ్యపేటలో గ్రామసభ నిర్వహించారు. సభ ప్రారంభమైన కొద్ది సేపటికి గ్రామానికి చెందిన జనసేన నాయకులు పిక్కి స్వామి, పిక్కి కోటి, మైలపల్లి ప్రసాద్ తమ అనుచరులతో వచ్చి సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తామని గ్రామంలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ను వివరించడంతోపాటు, ప్రణాళికలు తయారు చేసేందుకు ఈ సభ నిర్వహిస్తున్నామని సర్పంచ్ పిక్కి అప్పలనర్సతో పాటు కార్యదర్శి రాజశేఖర్, ఏడో వార్డు సభ్యుడు పిక్కి కామేశ్వరరావు తదితరులు నచ్చచెప్పేందుకు యత్నించారు. అయినా వినిపించుకోకుండా.. పిక్కి స్వామి అతని అనుచరులు దాడికి పాల్పడ్డారని సర్పంచ్ అప్పలనర్స ఫిర్యాదు లో పేర్కొన్నారు. దాడిని నివారించేందుకు వచ్చిన తన ఇద్దరు కుమారులపైనా జనసేన నాయకులు దాడి చేశారని తెలిపారు. మీ సంగతి తేల్చేస్తాం, చంపేస్తామంటూ పక్కనే ఉన్న రాళ్లు తీసి తమపై రువ్వడంతో ప్రాణభయంతో అక్కడ నుంచి పారిపోం య తలదాచుకోవడం జరిగిందన్నారు. 'ఎక్కడ ఉన్నా మిమ్మల్ని వదిలే ప్రసక్తి లేదని, ఇది రాజయ్యపేట అని, మా గ్రామ సత్తా ఏంటో చూపిస్తామం'టూ వారు తమను చంపేందుకు ప్రయత్నించారని సర్పంచ్ అప్పలనర్స పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా సభను నిర్వహించి, సర్పంచ్‌కు రక్షణ కల్పించే ప్రయత్నించిన తనపై కూడా జనసేన నాయకులు దాడులకు పాల్పడ్డారని కార్యదర్శి రాజశేఖర్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీ సభ్యులు సైతం ఈ సభకు హాజరయ్యారని, వారంతా సభలో ఉండగానే జనసేన నాయకులు ఈ దాడులకు పాల్ప డ్డారని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని సర్పంచ్ అప్పలనర్స, కార్యదర్శి రాజశేఖర్ పోలీసులకు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. రాళ్లు రువ్వి తమ ను అంతమొందించేందుకు ప్రయత్నించిన జనసేన నాయకులపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి తమకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్లో దొంగలు పడ్డారు

- కె.కోటపాడు స్టేషన్ నుంచి 200 కిలోల గంజాయి మాయం
- హెడ్ కానిస్టేబుల్ సహా ఇద్దరు అరెస్ట్
- ముగ్గురు మైనర్లపై చట్టపరమైన చర్యలు

కె.కోటపాడు: కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచిన 200 కిలోల గంజాయి చోరీ కావడం కలకలం రేపింది. సహకరించిన హెడ్ కానిస్టేబుల్ సహా ఇద్దరిని అరెస్టు చేశారు. ఈనెల 3న పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చిన గంజాయి కనిపించకపోవడంతో ఎస్‌ఐ ధనుంజయ్ ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ గౌతమి సాలి ఆదేశాల మేరకు అనకాపల్లి డీఎస్పీ సునీల్ ఆధ్వర్యంలో కె.కోటపాడు రూరల్ సీఐ తాతారావు, కె.కోటపాడు ఎస్‌ఐ ధనుంజయ్ విచారణ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి బయటకు వెళ్లేందుకు సహకరించినట్లు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌కుమార్ అంగీకరించాడని ఎస్‌ఐ తెలిపారు. గంజాయిని స్టేషన్ నుంచి తీసుకువెళ్లిన వారిలో ఎ.కోడూరు గ్రామానికి చెందిన శెట్టి సందీప్ (20)తో పాటు మరో ముగ్గురు మైనర్ బాలురు ఉన్నట్లు ఆయన తెలిపారు. విచారణలో గంజాయి దొంగిలించినట్లు వీరు ఒప్పుకోవడంతో హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌కుమార్, సంజీవ్ కుమార్‌లపై కేసును నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మైనర్లపై చట్టపరమైన చర్యలను తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



సహకరించిన హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌కుమార్

తొలి నుంచీ వివాదాస్పదమే..

కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌కు రెండేళ్ల క్రితం బదిలీపై వచ్చిన హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌కుమార్‌పై మొదటి నుంచీ విమర్శలున్నాయి. స్టేషన్‌కు వచ్చే వారితో కటువుగా వ్యవహరిస్తారని, ఇళ్ల నిర్మాణాలకు ఎడ్ల బండ్లపై ఇసుకను తీసుకువచ్చే రైతుల నుంచి కూడా డబ్బులు వసూలు చేసేవారని ఆరోపణలు ఉన్నాయి. శ్యామ్‌కుమార్‌పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో నాలుగు నెలల క్రితం చోడవరం మండలం గవరవరం చెక్‌పోస్టు పాయింట్ వద్ద ఆయనకు డ్యూటీ వేశారు. ఇటీవల చెక్‌పోస్టులు తీసేయడంతో మళ్లీ కె.కోటపాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇంతలోనే గంజాయి చోరీకి సహకరించి నిందితుడిగా మిగిలారు.

ఇసుక అక్రమ నిల్వలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక తరలిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్ : మండలంలోని గజపతినగరం, అంభేరుపురం, రామపురాజుపేట గ్రామాలలో శారదా నదీ పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను నది నుంచి తరలించి నిల్వలు చేయగా శనివారం దాడులు జరిపి ఇసుకను స్వాధీనం చేసుకున్నట్టు చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు తెలిపారు. పై మూడు గ్రామాలలో జరిపిన దాడులలో సుమారు 15 యూనిట్ల ఇసుకను అక్రమంగా నిల్వలు చేసినటు గుర్తించామన్నారు. ఇసుకను స్వాధీనం చేసుకుని లారీకి ట్రాక్టర్ ద్వారా లోడు చేయించి చోడవరంలోని పోలీసు స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ చెప్పారు. ఆయా గ్రామాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు, నిల్వ చేయడం, రవాణాకు పాల్పడడం చట్ట రీత్యా నేరమని గ్రామస్థులకు తెలియపరిచామని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్టు ఆయన చెప్పారు.

కళా నిలయంగా చోడవరాన్ని అభివృద్ధి చేస్తా

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- వైభవంగా ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



ముగింపులో కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా నిలయంగా చోడవరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మూడ్రోజుల పాటు జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవోపేతంగా ముగిశాయి. చోడవరం దేవదాయశాఖ హార్డింజ్ రెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్యాగరాజ వాయిద్య సంగీత పాఠశాల ట్రస్ట్, వాయిద్య కళాకారుల ఆధ్యాత్మిక సాంస్కృతిక సంఘం పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ కళలకు నిలయమైన చోడవరంలో పుణ్యక్షేత్రాలు స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, కేశవస్వామి, స్వయంభూ గౌరీశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలను ఇప్పటికే రాజగోపురాలు, ఇతర సదుపాయలతో అభివృద్ధి చేశామన్నారు. త్వరలో కళాభారతి ఆడిటోరియం నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం విద్యాంసులతో సన్నాయి, డోలు వాయిద్య కచేరీ, అమరావతి, సందకాడ నాదస్వరం బృందాలతో కచేరీ, తమిళనాడు, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన ప్రముఖ విద్వాంసులతో నాదస్వర కచేరీ సంగీత ప్రియులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురికి సన్మానం చేశారు. త్యాగరాజ వాయిద్య సంగీత పాఠశాల ప్రిన్సిపల్ రాయవరపు నానాజీ, ఎంపీపీ గాడి కాసు, ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు పప్పల జయదేవ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, సర్పంచ్ బండి నూకాలమ్మశ్రీను, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

బైకు ఢీకొని వైఎస్సార్‌సీపీ నాయకుడికి గాయాలు

నాతవరం : నర్సీపట్నం–తుని ఆర్‌అండ్‌బీ రహదారిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో శృంగవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాళ్ల రమణ బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణకు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అక్రమ మద్యంతో ఒకరి అరెస్టు

చోడవరం రూరల్ : అక్రమంగా అధికంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు చోడవరం ఎస్‌ఐ బి.అప్పలనాయుడు చెప్పారు. చోడవరం పట్టణంలోని తామరచెరువు వీధి వద్ద జుత్తాడ గ్రామానికి చెందిన జామి పట్టాభిరామ్ అనే వ్యక్తి వద్ద అధికంగా 12 క్వార్టర్ బాటిళ్ల మద్యం ఉండడంతో హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి గురువారం రాత్రి సోదా చేసి మద్యం పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ చైర్మన్‌గా గొంది చినబ్బాయ్



ఫ్యాప్టో నూతన కమిటీతో ప్రసాద్

అనకాపల్లి టౌన్: ఫ్యాప్టో (ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) జిల్లా నూతన కమిటీ చైర్మన్‌గా గొంది చినబ్బాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వై.సుధాకర్, కోశాధికారిగా పరదేశి, డిప్యూటీ సహాయ కార్యదర్శులుగా ఎస్.సన్యాసినాయుడు, ఎం.జె.సవీర్, కె.రమణాజీ, ఎం.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా వి.శ్రీలక్ష్మి, ప్రేమ్ కుమార్, వెంకట సూర్యనారా య ణ, సత్యనారాయణ, ఎ.వి.హెచ్.శాస్త్రీ ఎన్నికయ్యారు.

జిల్లాలో రూ.285 కోట్లతో ఉపాధి పనులకు ప్రణాళిక

- 1.11 కోట్ల మంది కూలీలకు ఉపాధి కల్పన లక్ష్యం
- అడిషనల్ ప్రాజెక్టు అధికారి రోజారాణి



మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్టు అధికారి రోజారాణి

నాతవరం: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.285 కోట్లతో ఉపాధి హామీ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామని అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 24 మండలాల్లో 645 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా వచ్చే ఏడాదికి ఉపాధి యాక్షన్ ప్లాన్ తయారు చేశామన్నారు. కోటి 11 లక్షల మంది కూలీలకు ఉపాధి పని కల్పిస్తామన్నారు. ఈ ఏడాది 85 లక్షల మందికి పని కల్పించామన్నారు. జిల్లాలో 5.86 లక్షల మందికి జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. వేతనదారులకు రూ. 163 కోట్లు చెల్లించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒక వేతనదారికి రోజుకు రూ.183 సరాసరిగా వచ్చిందన్నారు. పలు అభివృద్ధి పనులు మెటీరియల్ రూపంలో రూ.108 కోట్లు మేర పూర్తి చేశామన్నారు. 14,349 ఇళ్ల నిర్మాణాలకుగాను ఆరు లక్షల మంది కూలీలకు ఉపాధి పని కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జిల్లాలో అమృత్ సర్వోవర్ పథకంలో ప్రస్తుతం 32 చెరువుల్లో పనులు పూర్తి చేయగా, 74 చెరువులో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వైఎస్సార్ జలకళ పథకంలో 742 వ్యవసాయ బోర్లు మంజూరు కాగా, ప్రస్తుతం 292 బోర్లు పూర్తి చేశామన్నారు. కొత్త నిబంధనల ప్రకారం వచ్చే ఏడాది పంచాయతీ ఒక్కంటికి 20 పనులకు ఉపాధి నిధులు మంజూరుకు గ్రామసభలో తీర్మానాలు చేశామన్నారు. తహసీల్దార్ పి.కనకారావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, హౌసింగ్ పీఈ, ఆర్‌డబ్ల్యూ ఎస్ జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, రాజేష్, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, వెలుగు ఏపీఎం మర్రిలక్ష్మి పాల్గొన్నారు.

అయ్యన్నా.. హద్దు దాటొద్దు!

- నర్సీపట్నంలో సీఎం సభ చూసి పిచ్చెక్కిందా?
- మరో 30 ఏళ్లపాటు జగనన్నే ముఖ్యమంత్రి
- బాబు పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న దొంగలు మీరు
- మండిపడ్డ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నాతవరం: అయ్యన్నపాత్రుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, అమర్యాదగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం నాతవరంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల నర్సీపట్నంలో జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను చూసి అయ్యన్నకు పిచ్చెక్కి ఏమి చేయాలో తెలియక రెండు రోజుల క్రితం గునుపూడిలో రెచ్చిపోయి బూతులు మాట్లాడారన్నారు. తప్పతాగి పిచ్చి ముదిరి ఏమి మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. హద్దు దాటితే తమ కార్యకర్తలు బట్టలూడదీసి కొట్టడం ఖాయమన్నారు. సెల్‌ఫోన్ కనిపెట్టింది చంద్రబాబునాయుడని చెప్పడం చూస్తే అయ్యన్నపాత్రుడికి పిచ్చి ఏ స్థాయిలో ముదిరిపోయిందో తెలుస్తుందన్నారు. తమ పాలనలో చంద్రబాబు, అయ్యన్న రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. అలాంటి దోపిడీ దొంగలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, తమ పార్టీ నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వారు గ్రామాల్లో తిరుగుతుంటే.. దోచుకొని దాచుకున్న టీడీపీ దొంగలు మళ్లీ ఎందుకు వస్తున్నారు.. ఇదేం ఖర్మరా బాబూ.. అంటూ ప్రజలు వాపోతున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక మీ పని చెబుతామని పోలీసులను, అధికారులను అయ్యన్నపాత్రుడు బెదిరిస్తున్నాడని, తప్పతాగి పగటి కలలు కంటే అభ్యంతరం లేదు గానీ అవాకులు చవాకులు మాట్లాడితే ఊరుకోబోమన్నారు. రాజకీయాలతో పని లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సీఎం సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, దీంతో టీడీపీ అడ్రస్ గల్లంతవుతుందన్న భయంతో పిచ్చి కూతలు కూస్తున్నారన్నారు. మరో 30 ఏళ్లపాటు జగనన్నే సీఎం అవుతారన్నారు. ఎక్కడైనా సాంకేతిక సమస్య కారణంగా అర్హత ఉండి సంక్షేమ పథకం అందకపోతే తమ నాయకులకు తెలపాలని, వారు సచివాలయం దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైల పోతురాజు, సర్పంచ్ గోలగాని రాణీ ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీరింగ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తారువ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అసోసియేషన్ నూతన డైరీని ఆయన ఆవిష్కరించారు. ఏపీ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి. మురళీకృష్ణనాయుడు, జనరల్ సెక్రటరీ కనపర్తి సంగీతరావు, ట్రెజరర్ ఆర్. శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం. అర్జున అప్పారావు, విశాఖపట్నం జిల్లా ప్రెసిడెంట్ బి. జగదీష్‌బాబు, విజయనగరం జనరల్ సెక్రటరీ సిహెచ్.వి. అప్పారావు, జోన్–1 జనరల్ సెక్రటరీ జి. బంగారునాయుడు, అనకాపల్లి జిల్లా ప్రెసిడెంట్ జి.ఎస్.ఎస్. ప్రసాద్, పెందుర్తి డీఈఈ జి.ఎస్.ఎన్. మూర్తి, డిప్యూటీ సీఎం పర్సనల్ సెక్రటరీ జి. చిట్టిబాబు, మాడుగుల డీఈఈ టి.రమణ, బి. బాలాజీ అప్పారావు పాల్గొన్నారు.

ఉద్దండపురం మాజీ సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు

మరో 11 మందిపై కూడా



గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

నక్కపల్లి : దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ లౌడ్ స్పీకర్లో కించపరిచే విధంగా మాట్లాడిన ఉద్దండపురం మాజీ సర్పంచ్ పీకేటి రాజారావుపై దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. ఫిర్యాదిదారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 3వ తేదీన రాజారావు అనే వ్యక్తి గ్రామంలో ఆంజనేయ స్వామి గుడివద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం ఏర్పాటు చేసి దళితులను కించపరిచే విధంగా అనుచితంగా మాట్లాడారని ఆరోపించారు. దళితులను కులం పేరుతో దూషించారన్నారు. 4వ తేదీన గ్రామసభకు వచ్చే దళితులను అడ్డుకోవాలని వారికి బడితె పూజ చేయాలని మాట్లాడాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి గ్రామసభలో దళితులంతా రాజారావును ప్రశ్నించగా, అక్కడ కూడా దళితులపై అనుచితంగా కులంపేరుతో దూషిస్తూ మాట్లాడారన్నారు. రాజారావు వ్యాఖ్యలపై తాము పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారన్నారు. దళితుల నుంచి 8 మంది, రాజారావు వర్గీయులు 150 మంది వచ్చారన్నారు. జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన చర్చల సందర్భంలో రాజారావుతోపాటు అతని వర్గీయులు తమపై దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ దాడిలో దళిత మహిళలు పులిమార్తమ్మ, నూకరత్నం తీవ్రంగా గాయపడ్డారన్నారు. దీంతో బాధితులు తమపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు రాజారావుతోపాటు మరో 11 మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని, గ్రామంలోఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నందున పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని ఎస్‌ఐ శిరీష తెలిపారు.

కాఫీ సాగు విస్తరణకు కృషి



అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాఫీ ఏడీ అశోక్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని కాఫీ పంట సాగు విస్తరణతో పాటు, అధిక దిగుబడులు లక్ష్యంగా పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం కృషి చేయాలని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఇటీవల ఐటీడీఏ కాఫీ ఏడీగా బాధ్యతలు చేపట్టిన అశోక్ శుక్రవారం అరకులోయ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాఫీ సాగు ద్వారా గిరిజనులకు ఏటా మంచి ఆదాయం నెలకొంటుందని, గిట్టుబాటు ధర కల్పించి, నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

జమాదులపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామంలో శనివారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం యథావిధిగా జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించి, స్థానిక సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. అయితే రెండు రోజుల కార్యక్రమంలో భాగంలో శుక్రవారం జమాదులపాలెంలో జరగాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌పై హర్షం

అనకాపల్లిటౌన్ : పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసేందుకు పట్టణంలోని పడమర సబ్ ట్రెజరీ కార్యాలయంలో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేయడంపై పెన్షనర్లు శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వృద్ధుల ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ సౌకర్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

అనకాపల్లిటౌన్ : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ విభాగం వైద్యాధికారిణి లావణ్య అన్నారు. స్థానిక భీమునిగుమ్మం రామాలయంలో శుక్రవారం ఆయుష్ వైద్యంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా విపత్తుల సమయంలో ప్రజల్లో రోగ నిరోధక శక్తికి పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడిందన్నారు. కాలానుగుణంగా మానవుని జీవనశైలిలో మార్పులు తెచ్చుకోవాలని సూచించారు. ఆయుష్ విభాగంలో వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.రాజు, బి.కనకారావు, బి.నూకరాజు, అప్పారావు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 8,210 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,750	4,140
మొదటి రకం	3,250	3,620
రెండో రకం	3,100	3,400
మూడో రకం	3,000	3,080

అనకాపల్లి సినిమాలు

ధమాకా	-రాజా
ప్రత్యర్థి	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
కింగ్‌డమ్ ఆఫ్ డైనోసార్స్(తెలుగు)	-వెంకటేశ్వర
లవ్ టుడే	-శ్రీసత్య
అవతార్-2	-రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 75 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-46 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అతివలకు భరోసా.. వైఎస్సార్ ఆసరా

- డ్వాక్రా రుణమాఫీకి సిద్ధమవుతున్న జాబితాలు
- మూడోవిడతకు చురుగ్గా వేలిముద్రల సేకరణ
- నియోజకవర్గంలో 35,273 మందికి లబ్ధి


కశింకోటలో బయోమెట్రిక్ చేయించుకునేందుకు వచ్చిన మహిళలు


బవులవాడ సచివాలయంలో అర్హుల జాబితాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

అనకాపల్లి రూరల్ : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. ఆ దిశగా జగన్ ప్రభుత్వం మహిళలకు ఆసరాగా నిలుస్తూ, చిరు వ్యాపారులుగా మార్చేందుకు ప్రోత్సాహం అందిస్తోంది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణమాఫీ పూర్తిగా చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు బాహాటంగానే చేతులెత్తేశారు. 2019 ఎన్నికల ముందు పసుపు కుంకుమ పేరిట ఎరేసినా.. జనాలు నమ్మలేదు. డ్వాక్రా మహిళల కష్టాన్ని తెలుసుకునే 2019 ఏప్రిల్ 11నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో సభ్యుల ఖాతాలకు జమ చేస్తామని ప్రజా సంకల్ప యాత్రలో జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పటికే వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రెండు విడతలు చెల్లించారు. ప్రస్తుతం మూడో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.

15 నాటికి బయోమెట్రిక్ పూర్తి

త్వరలో ఆసరా సొమ్ము అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. నవరత్నాల అమలులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని అర్హులైన మహిళలకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో అర్హులైన మహిళల బయోమెట్రిక్(వేలి ముద్రలు) సేకరణ ప్రస్తుతం కొనసాగుతోంది. దీని ద్వారా నిర్వీర్యమైన గ్రూపులను తొలగించి అర్హులను గుర్తించనున్నారు. గతంలో రుణం చెల్లించిన వారిలో ఎవరైనా మరణిస్తే వారి నామినీలను అర్హులుగా నమోదు చేసేలా జగన్ ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ ప్రక్రియను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేసి, అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించనున్నట్టు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు తెలిపారు.

రెండు విడతల్లో రూ.54 కోట్లు లబ్ధి

మొదటి విడత రుణమాఫీ కింద అనకాపల్లి నియోజకవర్గంలో 3,395 స్వయం సహాయక సంఘాల్లోని 35,252 మంది మహిళల ఖాతాలకు రూ.27.18 కోట్లు జమ అయ్యాయి. రెండో విడతలో 3,400 సంఘాల్లోని 35,283 మంది మహిళలకు రూ.27.30 కోట్లను ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేసింది. మూడో విడత కింద రూ3,399 మహిళా సంఘాలకు 35,273 మందికి రూ. 27.20 కోట్లు చెల్లించేందుకు డీఆర్‌డీఏ అధికారులు లబ్ధిదారుల బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో గుర్తించిన లబ్ధిదారుల జాబితాలను సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రదర్శిస్తున్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే వాటిని పరిశీలించి, చర్యలు తీసుకుంటున్నారు. అభ్యంతరాలపై సామాజిక తనిఖీ చేపట్టేందుకు ప్రభుత్వం మూడు రోజులు గడువిచ్చింది. అభ్యంతరాలన్నీ పరిష్కరించి అర్హుల తుది జాబితాను సిద్ధం చేస్తున్నట్టు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

నిజంగా ఆసరా



గత ప్రభుత్వంలో రుణమాఫీ పేరుతో వంచించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రెండుసార్లు డబ్బులిచ్చారు. ఆ సొమ్ము మా కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు ఆసరాగా నిలిచింది. ఎన్నికల హామీని నిలబెట్టుకోవడంలో జగన్ తర్వాతే ఎవరైనా.

– మళ్ల లక్ష్మి, వినాయక గ్రామ సంఘం, కశింకోట

ఆనందంగా ఉంది



ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సొమ్ము జమచేస్తున్నారు. ఇప్పటికే 2 సార్లు రూ 17,500 చొప్పున అందుకున్నాం. మూడో విడత ఈ నెల్లో వస్తుందని, బయోమెట్రిక్ తీసుకున్నారు. ఆనందంగా వుంది. మహిళలకు అండగా ఉంటున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– గండిబోయిన అప్పలనర్స, లబ్ధిదారు, కశింకోట

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలుచే స్తోంది. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతీ మహిళ ఆర్థికంగా ఎదగాలి. ప్రభుత్వం ఇస్తున్న దానికి మరికొంత రుణాన్ని తీసుకుని స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలి. చిన్న, కుటీర పరిశ్రమలతో మహిళలు తమకాళ్లపై తాము నిలబడాలి. ప్రభుత్వ యంత్రాంగం తరఫున సంపూర్ణ సహకారం అందిస్తాం.

– కె.కుమారస్వామి, డీపీఎం, గ్రామీణాభివృద్ధి సంస్థ

పోషకాహారంతో రక్తహీనత నివారణ


జమాదులపాలెంలో విద్యార్థులు, వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది మానవహారం

కశింకోట : రక్త హీనత నివారణకు పోషకాహారం ఎక్కువగా తీసుకోవాలని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని జమాదులపాలెం, తేగాడ, వెదురుపర్తి తదితర గ్రామాల్లో వెలుగు ఆధ్వర్యంలో కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు శుక్రవారం రక్త హీనత నివారణపై ర్యాలీలు, మానవహారం, సమావేశాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రక్త హీనత వల్ల కలిగే లోపాలు, ఏ ఆహారం తీసుకుంటే రక్త హీనత నుంచి బయటపడవచ్చనే అంశాలపై వివరించారు. మునగ ఆకు, రాగి పిండి, పండ్లు, గుడ్లు, ఆకు కూరలు, కూరగాయలను ఆహారంలో నిత్యం ఉండేలా చూసుకోవాలన్నారు. వీటిని ఎంత ఎక్కువగా తీసుకుంటే.. అంత వేగంగా రక్త హీనత నుంచి బయటపడవచ్చన్నారు. గ్రామాల్లో ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు రక్త హీనత తగ్గే వరకు కిశోర బాలికలు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తుండాలని సూచించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కరక రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు గూడుపు వరలక్ష్మి, ఏఎన్ఎం దేవుడమ్మ, వెదురుపర్తి హైస్కూలు హెచ్ఎం ఆచారి, వెలుగు వీవో పి.తలుపులమ్మ, సీసీలు అనూరాధ, రామకృష్ణ, సత్యనారాయణ, వీవోఏలు మంగ, చినపాప, కుమారి, సత్యశ్రీ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు నాగమణి, ప్రశాంతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసునికి లక్ష తులసి పూజ


సీతారామస్వామి దేవాలయంలో లక్ష తులసి పూజ


పూజలు చేస్తున్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు సీతారామస్వామి దేవాలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా శుక్రవారం పౌర్ణమి సందర్భంగా శ్రీనివాసునికి లక్ష తులసి పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కె.సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు కోడూరు త్రినాథరావు మాట్లాడుతూ ఈనెల 14న భోగి రోజున శ్రీ రంగనాథ గోదాదేవి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని తరించాల్సిందిగా కోరారు. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.ద్రాక్షాయిని, లక్ష్మి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు గడువు ఫిబ్రవరి 20


డివిజన్ స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

తుమ్మపాల : ఫిబ్రవరి 20 నాటికి ఈ క్రాప్ నమోదు పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు అన్నారు. గవరపాలెం రైతు రైతు భరోసా కేంద్రంలో రబీ సాగు విస్తీర్ణం, రబీ ఈ క్రాప్ నమోదుపై డివిజన్ స్థాయి సమీక్ష శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ జాబితాపై ఫిబ్రవరి 21 నుంచి 28 వరకు సామాజిక తనిఖీ నిర్వహించి, మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పిస్తామన్నారు. మార్చి 7న తుది జాబితా ఖరారు చేయనున్నట్టు తెలిపారు. డివిజన్, మండలస్థాయి అధికారులు ఈ క్రాప్ నమోదుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ఈ కేవైసీ గడువు జనవరి 15కు పెంచినట్టు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, రైతులు గమనించాలని సూచించారు. సమీక్షలో ఏడీఏ కె.రామారావు, ఏవో పీయూబీపీ రంగాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు యూనిఫాం ధరించాల్సిందే


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ సునీల్

అనకాపల్లిటౌన్ : ఆటోడ్రైవర్లు యూనిఫాం ధరించాలని, రహదారులపై ఆటోలను అడ్డదిడ్డంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.సునీల్ హెచ్చరించారు. స్థానిక చోడవరం ఆటోస్టాండ్ వద్ద శుక్రవారం ఆటోడ్రైవర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్ పక్కన, వెనుక భాగంలో ప్రయాణికులుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనాలు నడిపే డ్రైవర్లు లైసెన్స్‌తోపాటు సంబంధిత రికార్డులు వెంట తీసుకురావాలన్నారు. అనుమానిత వ్యక్తులెవరైనా ఆటో ఎక్కితే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సంక్రాంతి పండగకు చాలా మంది స్వగ్రామాలకు వెళ్తారని, ఇలాంటి సమయంలో జరిగే చోరీలపై డ్రైవర్లు దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పి.శ్రీను, ఎస్ఐ రమేష్, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

'స్టోన్‌క్రషర్‌పై మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ'


ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు వెంకట అప్పారావు

అనకాపల్లిటౌన్ : మండలంలోని బవులవాడ గ్రామంలో సర్వే నెం.75లోని మూడు హెక్టార్లలో సీహెచ్ మహాలక్ష్మినాయుడు స్టోన్‌క్రషర్ ఏర్పాటుపై శుక్రవారం ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. దీన్ని గ్రామస్తులు వ్యతిరేకించారు. గ్రామంలో 8 వేల మంది నివసిస్తున్నారని, 120 మందితో తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆక్షేపించారు. గ్రామస్తులందరి సమక్షంలో మరోసారి అభిప్రాయసేకరణ జరపాలని వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మజ్జి వెంకట అప్పారావు డిమాండ్ చేశారు. డీఆర్వో వెంకటరమణ, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శన్‌లు మాట్లాడుతూ ఉన్నతాధికారులను సంప్రదించి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత బస్సుల్లో శ్రీవారి దర్శనానికి పయనం


ఉచిత బస్సుల్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : సమరసతా సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని అచ్యుతాపురం, మునగపాక, రాంబిల్లి మండలాల నుంచి శ్రీవారి దర్శనానికి ఉచిత బస్సుల్లో భక్తులు శుక్రవారం బయలుదేరారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్పించిన ఈ సౌకర్యంలో భాగంగా మత్స్యకార ప్రాంతాల నుంచి భక్తులు తరలివెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా 289 దేవాలయాల నిర్మాణానికి భూమి పూజ జరిగిందని, ఆయా ప్రాంతాల నుంచి భక్తుల్ని ఉచిత బస్సుల్లో శ్రీవారి దర్శనానికి తీసుకెళ్తున్నామని సమరసతా సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు తెలిపారు. సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ మాట్లాడుతూ శ్రీవారి దర్శన భాగ్యం దొరకడం ఎంతో అదృష్టంగా పేర్కొన్నారు. కాగా శుక్రవారం ఉచిత బస్సులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

పరిశుభ్రతతో దోమల నియంత్రణ


ఫ్రైడే-డ్రైడే ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆయా ప్రాంతాల ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానందనగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నిర్మూలించవచ్చన్నారు. దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు, దోమ కాటువల్ల వచ్చే వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు. ఆరోగ్యగ్య సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. రహదారి, కాలువల్లో చెత్తా చెదారం వేయడం వల్లే దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాప్తిస్తున్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, జిల్లా మలేరియా అధికారి దొర, వైద్యులు విష్ణుమూర్తి, మహేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిల్వ నీటితోనే డెంగీ, మలేరియా


గుడ్డసంచులు ప్రదర్శిస్తున్న సన్యాసిరావు, కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు

అనకాపల్లిటౌన్ : ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావు అన్నారు. గవరపాలెం విజ్ఞాన సమితి వద్ద శుక్రవారం దోమల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఖాళీ కొబ్బరిబొండాలు, పూలకుండీల్లో నీరు నిల్వలేకుండా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజుల తరబడి నిల్వ ఉన్న నీటి నుంచి డెంగీ దోమ పుడుతుందన్నారు. డెంగీ, మలేరియా జ్వరాలు రావడానికి నీటి నిల్వలే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ పాలిథిన్ సంచుల స్థానంలో గుడ్డ సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి భాస్కర్, జీవీఎంసీ సిబ్బంది రజని, వైఎస్సార్‌సీపీ నాయకులు భీశెట్టి కృష్ణ అప్పారావు, కాండ్రేగుల చందు, దాడి శ్రీనివాసరావు, పెంటకోట దామోదరం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లూ.. మీకు వందనాలు

పింఛన్ల పంపిణీలో సీఎం జగన్ ఆశయాలకు వలంటీర్లు మరింత ఆసరాగా నిలుస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడరాదనే.. వారింటికే వెళ్లి పింఛన్లు అందించేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. కొన్ని విపత్కర సమయాలు, అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నపుడు వలంటీర్లు తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. తమ సొంత ఖర్చుతో ఆయా ప్రాంతాలకు వెళ్లి మరీ, వారికివ్వాల్సిన పింఛన్ నగదును అందిస్తున్నారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడంలో తోడ్పడుతున్నారు. అదే కోవలో జనవరి నెల పెంచిన పింఛన్ల అందజేతలో కూడా ఇద్దరు వలంటీర్లు తమ పెద్ద మనసును చాటుకున్నారు.

– అనకాపల్లి టౌన్/కశింకోట


ఆస్పత్రిలో వేణుగోపాలరావు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ వెంకట అప్పారావు


గాడి సత్యవతికి ఆస్పత్రిలో పింఛన్ సొమ్ము అందిస్తున్న గ్రామ వలంటీర్ పప్పల సుజాత

మండలంలో మేజర్ పంచాయతీ అయిన తుమ్మపాల సచివాలయం-3 పరిధి చిన్నిబాబుకాలనీకి చెందిన ఆకెళ్ల వేణుగోపాలరావు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. నెల రోజుల నుంచి విశాఖలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ వెంకట అప్పారావు వృద్ధునికి పింఛన్ కానుక ఎలాగైనా త్వరితగతిన అందించాలనే ఆలోచనతో విశాఖలోని సదరు ఆస్పత్రి వెళ్లాడు. ఆస్పత్రిలో వ్యాధితో పోరాడుతున్న వృద్ధునికి పెంచిన రూ.2,750 పింఛన్ అందించాడు. వేణుగోపాలరావు కుటుంబ సభ్యులు జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధికి ధన్యవాదాలు తెలిపారు.

కశింకోటలోని సత్తెమ్మ కాలనీకి చెందిన గాడి సత్యవతి విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో కిడ్నీ సమస్యతో బాధపడుతూ కొద్ది రోజులుగా చికిత్స పొందుతోంది. అయితే గడువు మేరకు శనివారంలోగా పింఛన్ సొమ్ము తీసుకోకపోతే అది వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక అఫీషియల్ కాలనీకి చెందిన గ్రామ వలంటీర్ పప్పల సుజాత ఇక్కడ నుంచి విశాఖకు వెళ్లి సత్యవతికి రూ.2,750 పింఛన్ సొమ్మును అందజేశారు. దీంతో సత్యవతి ఆనందం వ్యక్తం చేశారు. వలంటీర్ సుజాతకు, సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బూడిద లారీల అడ్డగింత


బూడిద లారీ ఎదుట ఆందోళనకు దిగిన స్థానికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి బూడిద తరలిస్తున్న లారీ ఢీ కొట్టడడంతో కలపాక శివారు గొల్లలపాలెం గ్రామానికి చెందిన బొంతాడ నగేష్ గురువారం రాత్రి స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదం విషయం తెలిసినా యాష్ పాండ్ కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో శుక్రవారం గొల్లలపాలెం గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి రోడ్డుపై బైఠాయించి బూడిద లారీలను అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలకు వేగంగా రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలే కారణమని ఆరోపించారు. బూడిద లారీల కారణంగా ఎగసిపడుతున్న బూడిద వల్ల తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నామని వాపోయారు. అయినా లారీల యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5నుంచి 7 సమయాల్లో బూడిద లారీలను రోడ్లపై తిరగకుండా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లేశ్వరరావు ఘటన స్థలానికి వెళ్లి సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. దీంతో ఆందోళన విరమించారు. నాయకులు చప్పా సన్యాసిరావు, బొట్టా నూకరాజు, శ్రీను, ఎస్.రమేష్, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?


అధ్వానంగా మారిన వెంకటాపురం రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి-వెంకటాపురం రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు తేలిన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు నిత్యం నరకం చూస్తున్నారు. రాళ్ల వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన రహదారి ఏళ్ల తరబడి శిథిలావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రైతులు తమ ఫలసాయాలను పట్టణ ప్రాంతాలకు తరలించే క్రమంలో రహదారిలో పడరాని పాట్లు పడుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో నిర్ణీత సమయానికి పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు అంటున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి రహదారి మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.